# పద్యధారణ – జూనియర్స్ విభాగము – కంఠస్థ పద్యములు

సూచనలు: ఉచ్చారణ స్పష్టంగా ఉండాలి. ఒత్తులు దీర్ఘాలు చక్కగా పలకాలి. రాగయుక్తంగా పాడిన పద్యాలకు అధిక ప్రాధాన్యత ఉండదు.
క్రింది పద్యాలలో న్యాయ నిర్ణేతలు వారికి తోచిన కొన్ని పద్యాలు అడుగుతారు

1. ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారు పూసెజ్జపై
నొకచో శాకము లారగించు, నొకచో నుత్కృష్టశాల్యోదనం
బొకచో బొంత ధరించు, నొక్కొకతఱిన్ యోగ్యాంబరశ్రేణి లె
క్కకు రానీయడు కార్యసాధకుడు దు:ఖంబున్ సుఖంబున్ మదిన్.

2. కరమున నిత్యదానము, ముఖంబున సూనృతవాణి, యౌదలం
గురుచరణాభివాదన, మకుంఠిత వీర్యము దోర్యుగంబునన్
వరహృదయంబునన్ విశదవర్తన, మంచితవిద్య వీనులన్
సురుచిరభూషణంబు లివి శూరులకున్ సిరి లేనియప్పుడున్.

3. తనుహృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్, దాసత్వమున్, వందనా
ర్చనముల్, సేవయు, నాత్మలో నెఱుకయున్, సంకీర్తనల్, చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మిస
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా!

4. కారే రాజులు! రాజ్యముల్ గలుగవే! గర్వోన్నతిం బొందరే!
వారేరీ ? సిరి మూట గట్టుకొని పోవం జాలిరే! భూమి పై
బేరైనం గలదే! శిబిప్రముఖులుం బ్రీతిన్ యశ:కాములై
యీరే కోర్కులు! వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా!

5. సిరిగలనాడు మైమఱచి, చిక్కిననాడు దలంచి పుణ్యముల్
పొరిబొరి సేయనైతినని పొక్కినగల్గునె గాలిచిచ్చుపై
గెరలిన వేళదప్పికొని కీడ్పడువేళ జలంబు గోరి త
త్తరమున ద్రవ్వినంగలదె దాశరథీ కరుణాపయోనిధీ

6. చదువది ఎంతగల్గిన రసజ్ఞత యించుకచాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతు లెవ్వరుమెచ్చ రెచ్చటం
బదునుగ మంచికూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పులేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా.

7. పండితులైనవారు దిగువందగ నుండగ నల్పుడొక్కడు
ద్దండత బీఠమెక్కిన బుధప్రకరంబున కేమియెగ్గగున్
గొండొక కోతి చెట్టు కొనకొమ్మలనుండగ గ్రింద గండభే
రుండ మదేభసింహ నికురుంబములుండవె? చేరి భాస్కరా.

8. రాకొమరుల్ రసజ్ఞుని దిరంబుగ మన్నన నుంచినట్లు భూ
లోకమునందు మూఢుదమలోపలనుంపరు, నిక్కమేకదా
చేకొని ముద్దుగా చదువు చిల్కను బెంతురుగాక పెంతురే
గాకము నెవ్వరైన శుభకారణ సన్మని సేవ్య భాస్కరా.

9. దక్షుడు లేనియింటికి బదార్థము వేఱొక చోటనుండి వే
లక్షలు వచ్చుచుండిన బలాయనమై చను గల్లగాదు ప్ర
త్యక్షము వాగులున్ వఱదలన్నియు వచ్చిన నీరు నిల్చునే
యక్షయమైన గండి తెగినట్టి తటాకములోన భాస్కరా.

10. కొడుకుల్ పుట్టరటంచునేడ్తు, రవివేకుల్ జీవనభ్రాంతులై
కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రున కనేకుల్, వారిచే నేగతుల్
పడ సెం? పుత్రులు లేని యా శుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్షపదం బపుత్రకునకున్ శ్రీకాళహస్తీశ్వరా!

11. ఆరంబోసిన పండు వెన్నెలలు నీహారాంబువుల్ మేల్మిబం
గారమ్మున్ దొవలేకు మెత్తనలు ముక్తాహారముల్ సాంద్ర క
ర్పూర క్షోదము గర్భకైతక దళంబుల్ కార్తికీ శాలి కే
దారశ్రేణులు రూపుగొన్న కవితా తన్వంగికిన్ భద్రమే!

12. నీలో నూలు తయారుజేయు మర గానీ, ప్రత్తిరాట్నంబు గా
నీ, లే; దీశ్వరశక్తి నీ కడువులోనే లీనమై యుండునో
యేలీలన్ రచియింతు వీజిలుగునూ లీపట్టు పుట్టంబు! లో
సాలీడా; నిను మోసగాడవని విశ్వంబేల ఘోషించెడిన్?

13. అమలసువర్ణశృంగఖుర మై కపిలం బగుగోశతంబు ను
త్తమబహు వేదవిప్రులకు దానము సేసిన దత్ఫలంబు త
థ్యము సమకూరు భారతకథాశ్రవణాభిరతిన్ మదీయ చి
త్తము ననిశంబు భారతకథాశ్రవణ ప్రవణంబు గావునన్.

14. మహి మున్ వాగనుశాసనుండు సృజియింపన్, గుండలీంద్రుడు ద
న్మహనీయస్థితిమూలమై నిలువ: శ్రీనాథుండు ప్రోవన్, మహా
మహులై సోముడు భాస్కరుండు వెలయింపన్, సొంపు వాటించు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమున దత్ప్రాగల్భ్యమూహించెదన్.

15. బొంకనివాడెయోగ్యు డరి బృందము లెత్తినచోట జివ్వకుం
జంకనివాడెజోదు, రభ సంబున నర్థికరంబు సాచినం
గొంకని వాడెదాత, మిమ్ముగొల్చి భజించిన వాడెపో నిరా
తంకమనస్కు డెన్నగను దాశరధీ కరుణాపయోనిధీ.